ఈనాడు శ్రీకాకుళం
బుధవారం అక్టోబరు 2, 2024 7

సంబరం.. ఆరంభం..

★ వైభవంగా కొత్తమ్మతల్లి ఉత్సవాలు మొదలు

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి



భక్తుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎటుచూసినా ఆధ్యాత్మిక సందడే కనిపించింది.. వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అమ్మ వేడుకను ఈసారి రాష్ట్ర పండగగా ప్రకటించడంతో అందుకు తగిన ఏర్పాట్లు చేశారు.



పట్టువస్త్రాలతో వస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దంపతులు, చిత్రంలో ఎస్పీ

కేంద్రమంత్రి పట్టువస్త్రాల సమర్పణ..

ప్రభుత్వం తరఫున అమ్మవారికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఇందులో పాల్గొన్నారు. అమ్మవారికి అలంకరించనున్న గజమాలలు, పుష్పాలను కలెక్టరు అర్చకులకు అందజేశారు. ఉదయం అమ్మవారి జంగిడి వెళ్లిన తదుపరి తొలి పూజలను కేంద్రమంత్రి దంపతులు, కలెక్టర్, నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, నేతలు చేశారు. ప్రధాన అర్చకులు సుసరాపు గణపతిశర్మ, అరసవల్లి అర్చకులతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయానికి కేంద్ర, రాష్ట్రమంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు ద్విచక్ర వాహనంపై రావడం అంతా ఆసక్తిగా చూశారు.



దర్శనానికి వస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వేకువజాము నుంచే..

వేకువ జాము నుంచే పెద్దఎత్తున భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి కొద్ది దూరం వరకు ఉన్న క్యూకాం ఫ్లెక్సులు మరికాస్త పెంచితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. మూడోరోజు గురువారం భక్తులు లక్షల్లో వచ్చే అవకాశమున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. క్యూకాంప్లెక్సుల్లో గ్రామీణ నీటిసరఫరా విభాగం పెట్టిన డ్రమ్ముల్లో తాగునీరు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.



కమ్మకట్టు వారింటికి జంగిడి..

ఉదయం మేళతాళాలతో రెడ్డికవీధి నుంచి పసుపు, కుంకుమలతో భక్తుల నడుమ కొత్తమ్మతల్లి ఆలయానికి చేరుకున్న జంగిడి పూజలు, దండకాల అనంతరం తిరిగి కమ్మకట్టువారింటికి బయల్దేరి వెళ్లింది. ఈ సందర్భంగా జంగిడి పాదాలకు మహిళలు, చిన్నారులు భక్తితో ప్రణమిల్లారు. జంగిడి దర్శనం లభించటంతో పరవశించిపోయారు. మంగళవారం వెళ్లిన జంగిడి తిరిగి గురువారం వేలాది ఘటాలతో ఆలయానికి చేరుకుంటుంది.



అమ్మను దర్శించుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు దంపతులు

97.94 శాతం పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో తొలి రోజు 97.94 శాతం ఎన్టీఆర్ పింఛను భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం 3,15,630మంది లబ్ధిదారుల్లో 3,09,128 మందికి రూ.126.19 కోట్ల నగదును సచివాలయ సిబ్బంది నేరుగా అందజేశారు. పంపిణీలో ఉదయం 11:30 గంటల వరకు జిల్లా ప్రథమ స్థానంలో కొనసాగింది. వలసదారులు, మృతులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రాత్రి 10 గంటల సమయానికి 8వ స్థానానికి పడిపోయింది.

నేటి నుంచి బడులకు సెలవులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని పాఠశాలలకు బుధవారం నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామ రాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పసిడి కాంతుల్లో వెలుగులరేడు



మూలవిరాట్టును తాకుతున్న కిరణాలు

భానుడి లేలేత కిరణాలతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రం పులకించిపోయింది. దేవస్థానంలో మంగళవారం ఆదిత్యుడి మూలవిరాట్టును తాకగానే స్వామి బంగారం వర్ణంలోకి మారి దర్శనమిచ్చారు. ఆకాశంలో మబ్బులు లేకపోవడంతో ఉదయం 6.01 గంటల నుంచి 6.04 వరకు ఈ సుందర దృశ్యం సాక్షాత్కారమైంది. కిరణాలు స్వామి హృదయభాగం నుంచి పాదాల వరకు తాకాయి. మూడు నిమిషాల పాటు భక్తులు పరవశించారు. రెండేళ్ల తర్వాత సూర్యకిరణాల పడ్డాయని ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ తెలిపారు. బుధవారం కూడా కిరణాలు స్వామిని తాకే అవకాశం ఉందన్నారు. ఈవో వై.భద్రాజీ, భక్తులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

నవోదయ 9, 11 తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరం 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డి.వరప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతూ, జిల్లాలో నివాసముండే విద్యార్థులు అందరూ ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. జులై ఒకటి 2010 నుంచి 31 జులై 2012 మధ్య, పదో తరగతి విద్యార్థులు జూన్ ఒకటి 2008 నుంచి 31 జులై 2010 మధ్య జన్మించినవారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసేందుకు గడువు ఈ నెల 30వ తేదీగా నిర్ణయించారు. 2025 ఆగస్టు 8వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

బడ్డీలే అడ్డాలు..!

● యథేచ్ఛగా గంజాయి విక్రయాలు ● యువతే లక్ష్యంగా వ్యాపారం



జిల్లాలో గంజాయి ముఠాలు పేట్రేగిపోతున్నాయి. సరకు ఎంత కావాలంటే అంత, ఎక్కడికి కావాలంటే అక్కడికి, ఎంత మోతాదులోనైనా ఏ సమయానికికైనా సరఫరా చేయడానికి సిద్ధం అంటున్నాయి.. రవాణాపై పోలీస్ నిఘా పెరుగుతోంది.. ఎక్కువగా తెలిసిన వారిని, వయసులో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని దందా సాగుతోంది.. చౌకగా కొనుగోలు చేసి దానికి రెండింతల ధరకు విక్రయిస్తున్నారు. చాలా వరకు బడ్డీలను కేంద్రాలుగా చేసుకుంటున్నారు.

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే నేరవార్తా విభాగం

★ ఇటీవల ఆమదాలవలస మండలం మెట్టక్కివలసలో 20 ఏళ్లలోపు వయసు ఉన్న ఇద్దరు రెండు కిలోలకు పైగా గంజాయితో పోలీసులకు చిక్కారు. తక్కువ ధరకు సరకు కొనుగోలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో యువతకు విక్రయించడానికి తీసుకొచ్చినట్లుగా తేలింది.

★ ఈ నెల 9న ఇచ్ఛాపురం శివారు పురుషోత్తపురం వద్ద ఓ బడ్డీలో 25 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. చిన్న పొట్లాలుగా చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. గతేడాది డిసెంబరులో ఇక్కడి చెక్‌పోస్టు వద్ద చిన్న దుకాణంలో వంద కిలోలకు పైగా సరకు దొరికింది.

★ శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఇటీవల గంజాయి, సిగరెట్లు తాగుతున్న ఆనవాళ్లు కనిపించాయి. పోలీసులు రంగంలోకి దిగి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి శిథిలావస్థకు చేరిన భవన సముదాయాన్ని మూసివేయించారు.

★ శ్రీకాకుళం నగరంలో గంజాయి విక్రయిస్తున్న తొమ్మిది మంది యువకులను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. 22 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నారు.

★ అరసవల్లి నుంచి కలెక్టరేట్ వరకు నిర్మించిన 80 అడుగుల రహదారిలో రాత్రి వేళ గంజాయి దట్టించిన సిగరెట్లను కొందరు యువకులు తాగుతున్నారు. మరి కొందరు నాగావళి నది ఒడ్డున కూర్చొని పీలుస్తున్నారు.

★ పలాస మండలం అల్లుఖోల, రెంటికోట గ్రామాల మధ్యలో ఓ కొండ వద్ద గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. రాత్రి వరకు కొందరు అక్కడే ఉండి తాగుతున్నట్లు సమాచారం.

గంజాయి వినియోగిస్తున్న వారిలో యువతే ఎక్కువ. కొందరు బానిసలుగా మారుతున్నారు. చిన్న వయసులోనే అలవాటు అవడంతో జీవితాన్ని చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. బడ్డీల్లో 50, 100 గ్రాముల పరిమాణంలో పొట్లాలు విక్రయిస్తున్నారు. కొందరు దుకాణదారులు సిగరెట్లలో గంజాయి దట్టించి ఒక్కోటి రూ.150 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు.

ఒక్కో సిగరెట్ రూ.150

హుక్కాలో పీల్చి తాగడానికి వీలుగా పరికరాలను సమకూరుస్తున్నారు. ★ కొందరు సైకిల్ ట్యూబ్‌కి ప్యాచ్‌లు వేసే ద్రావణాన్ని కొనుగోలు చేసి వస్త్ర ముక్కల్లో వేసుకొని పీల్చుతున్నారు. చాలా మంది దీనికే మక్కువ చూపుతున్నారు. వైట్‌నర్, ఆల్ అవుట్, శానిటైజర్‌లో స్పిరిట్ శాతం ఉండటంతో మత్తు కోసం రకరకాలుగా పీలుస్తున్నారు.

జీవితాలు చిన్నాభిన్నం..

శ్రీకాకుళం నగరంలోని సర్వజనాసుపత్రిలో వ్యసన విముక్తి కేంద్రానికి మూడేళ్లుగా గంజాయి, మత్తు, మాదకద్రవ్యాలకు అలవాటు పడిన సుమారు 200 మంది చికిత్స కోసం వచ్చారు. వీరిలో ఎక్కువగా యువత ఉండటం గమనార్హం. ఎక్కువగా మతిమరుపు, మెదడు సంబంధిత సమస్యలు, కడుపులో మంట, నరాల బలహీనత, కంటి చూపుపై ప్రభావం, నడవడికలో మార్పులు గమనించినట్లు వైద్యులు చెబుతున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు స్థానికంగా అందుబాటులో ఉండటంతో వినియోగిస్తున్నామని చికిత్స కోసం వచ్చిన వారు వైద్యులకు చెబుతున్నారని సమాచారం.



శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద రెండో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి పొట్లాలు.



శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలోని ఓ వసతిగృహ భవనంలో పీల్చి వదిలేసిన మత్తు పదార్థాల పొట్లం.. ఇలాంటివి కుప్పలుగా ఉన్నాయి. మత్తుబాబులకు అడ్డాగా ఈ ప్రాంతం మారింది.

తెలిసిన వారికే అమ్మకం..

ఒడిశాలోని పర్లాఖెముండి, బ్రహ్మపుర తదితర ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల్లో సరకు తీసుకొస్తున్నారు. ఒడిశాలో కిలో రూ.5 వేలకు కొనుగోలు చేస్తున్నారు. స్థానిక అవసరాలకు కొంత ఉంచుకుని కొంత బెంగళూరు, హైదరాబాద్, గుజరాత్ తరలిస్తున్నారు. కిలో రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక బడ్డీ నుంచి ఎంపిక చేసుకున్న గ్రామాలకు సరకు తరలిస్తున్నారు. ఇక్కడ తెలిసిన వారికి కోడ్ భాషలో అడిగితేనే అమ్ముతారు.

జీవితాలు పాడుచేసుకోవద్దు

జిల్లాలో గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నాం. వినియోగాన్ని లేకుండా చూస్తున్నాం. యువత మత్తు ఉచ్చులో పడి జీవితాలను పాడు చేసుకోవద్దు. ఇటీవల పట్టుబడిన 20 మందిని విశాఖలోని వ్యసన విముక్తి కేంద్రానికి తరలించాం. ఎక్కడికక్కడ కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి విక్రయించినా, సేవిస్తూ పట్టుబడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. – కె.వి.మహేశ్వర రెడ్డి, ఎస్పీ శ్రీకాకుళం

మహాత్ముడికి అపురూప నివాళి

రణస్థలం మండలం కొండములగాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో మహాత్ముడి రూపంలో కూర్చొని ఆయనకు ఘన నివాళులర్పించారు. పాఠశాల ప్రధానాచార్యులు పి.శ్రీధర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సుమారు 600 మంది విద్యార్థులతో చేసిన ఈ ప్రయత్నం ఆకట్టుకుంది. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల (రణస్థలం)



158 ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతి

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానం ఖరారైంది. అందులో భాగంగా జిల్లాలో ప్రైవేటుగా 158 మద్యం దుకాణాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆసక్తి గలవారు ఈ నెల 9వ తేదీలోగా ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు రుసుంగా రూ.2 లక్షలు చెల్లించాలి. శ్రీకాకుళం, ఆమదాలవలస, రణస్థలం, పొందూరు, నరసన్నపేట, కొత్తూరు, పాతపట్నం, టెక్కలి, కోటబొమ్మాళి, కాశీబుగ్గ, సోంపేట, ఇచ్ఛాపురం ప్రాంతాల్లోని ఎక్సైజ్ సీఐ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలి.

కేటాయింపు ఇలా..

ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చిన దుకాణాలకు ఈ నెల 11న ఉదయం 8 గంటల నుంచి శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఉన్నతాధికారుల సమక్షంలో లాటరీ తీసి కేటాయిస్తారు. దానికి రెండేళ్ల కాలపరిమితి ఉంటుంది.



శ్రీకాకుళం నగరంలోని పాత బస్టాండ్ సమీపంలో మద్యం దుకాణం వద్ద రద్దీ

దుకాణం లైసెన్స్ దక్కకపోయినా దరఖాస్తు రుసుం తిరిగి ఇవ్వరు. కేటాయింపు జరిగాక లైసెన్స్ ఫీజు కింద జనాభా ప్రాతిపదికన రూ.55 లక్షలు, రూ.65 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. శ్రీకాకుళం నగరంతో పాటు గ్రామీణ మండలం, గార, ఎచ్చెర్లతో పాటు పలు ప్రాంతాల్లో రూ.65 లక్షలుగా లైసెన్స్ ఫీజు నిర్ణయించారు. దాన్ని వాయిదాల పద్ధతిలో ప్రతి రెండు నెలలకో సారి చెల్లించుకునే వెసులుబాటు కల్పిస్తూ అధికారులు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. గతంలోనే ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వెల్లువలా వచ్చేవి. ఈసారి పోటీ రెట్టింపు ఉంటుందని భావిస్తున్నారు.

9 వరకు దరఖాస్తుకు అవకాశం

తెరుచుకున్నవి కొన్నే..

జిల్లాలోని సూపర్ వైజర్లు, సేల్స్ మెన్లు విధులకు దూరంగా ఉండటంతో ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం మధ్యాహ్నం వరకు తెరుచుకోలేదు. అధికారులు ఎక్సైజ్‌తో పాటు బార్ అండ్ రెస్టారెంట్‌లలో పని చేసే సిబ్బంది ద్వారా రెండో పూట నుంచి కొన్ని చోట్ల తెరిచారు. ఓ వైపు లైసెన్స్‌ల జారీ ప్రక్రియలో నిమగ్నమైన అధికారులకు ఈ పది రోజులు దుకాణాలను ఎలా నడపాలోనని సతమతమవుతున్నారు.

బీలకు ఖరీఫ్ కళ..!

● పదేళ్ల తరువాత పూర్తిస్థాయిలో నాట్లు ● అన్నదాతకు కలిసివచ్చిన అల్పపీడన ప్రభావం

ఏళ్ల తర్వాత బీల ప్రాంతం పచ్చదనంతో కళకళలాడుతోంది. దశాబ్ద కాలంగా ఖరీఫ్‌లో వరి సాగు ఆశించిన మేరకు జరగడం లేదు. ఈ ఏడాది ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తడంతో రైతులు ఆలోచనలో పడ్డారు. వర్షాలు కురవడం, నీటి వనరులకు జలకళ రావడంతో పూర్తిస్థాయిలో నాట్లు వేశారు. పంట చక్కగా ఉండటంతో కనుచూపు మేర బీల ప్రాంతం పచ్చని రంగేసినట్టు కనిపిస్తోంది. అన్నదాతలు పాత రోజుల్ని గుర్తు చేసుకుంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, సోంపేట, కవిటి గ్రామీణం

నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నప్పటికీ ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాదీ నాట్లు వేసే పరిస్థితి అంతంతమాత్రమేనని అధికారులు, రైతులు భావించారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బీల ప్రాంతానికి వరంలా మారింది. నెల రోజుల వ్యవధిలో వరుసగా మంచి వర్షాలు కురవడంతో చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరులు నిండుకుండల్లా మారాయి.

★ సాగునీరు అందుబాటులోకి రావడంతో సోంపేట, కంచిలి, కవిటి మండలాల బీల పరిధిలో 15 వేల ఎకరాల్లో పది రోజుల వ్యవధిలో నాట్లు పూర్తి చేశారు. తరువాత కురిసిన వర్షాలతో ఎగువ నుంచి పెద్దఎత్తున వరద బీల ప్రాంతానికి చేరడంతో పంట పొలాలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. రైతులు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. కవిటి మండలం ఇద్దివానిపాలెం వద్ద పొగురు తీయించి సముద్రంలోకి వరద నీరు వెళ్లేలా చర్యలు చేపట్టడంతో ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు తీరాయి.



బారువపేట వద్ద కళకళలాడుతున్న పొలాలు

చిరుపొట్ట దశలో ఉంది..: ఈ ఏడాది సాగునీరు అందుబాటులో ఉండటంతో వరి సాగు ఆశాజనకంగా ఉంది. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో బీలలో పూర్తిస్థాయిలో వరి నాట్లు వేయగలిగారు. ప్రస్తుతం పంట చిరుపొట్ట దశలో ఉంది. వరద ముంపు ఇబ్బందులు తలెత్తకపోతే మెరుగైన దిగుబడులకు అవకాశం ఉంది. చాలా రోజుల తరువాత బీల పచ్చదనంతో కళకళలాడుతోంది.


– బి.నర్సింహమూర్తి, వ్యవసాయాధికారి, సోంపేట

సదా.. మహాత్ముడి స్మృతిలో..!

దూసి రైల్వేస్టేషన్‌లో గాంధీజీ స్మారక కేంద్రం ఏర్పాటుకు చర్యలు

సిక్కోలు నేలపై జాతిపిత మహాత్మగాంధీ అడుగులు.. స్వాతంత్ర్య ఉద్యమ వేళ జిల్లాలో ఆయన గుర్తులు ఓ మధుర జ్ఞాపకంగా నిలిచిపోయాయి. వాటిల్లో దూసి ఆమదాలవలస మండలంలోని దూసి రైల్వే స్టేషన్ ఒకటి. నాటి సంగతులను నేటి తరానికి తెలియజేసేందుకు అక్కడ గాంధీజీ స్మారక కేంద్రం ఏర్పాటు చేయాలని ఇటీవల నిర్ణయించారు. ఈ నేపథ్యంలో నేడు 'గాంధీ జయంతి' సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం, ఆమదాలవలస గ్రామీణం

అది 1942లో క్విట్ ఇండియా ఉద్యమం జరుగుతున్న సమయం. జిల్లాలోనూ ఉద్యమం ఊపందుకోవడంతో నిరసనకారులు రాత్రి వేళల్లో సమావేశాలు నిర్వహించుకునేవారు. ఓరోజు ఉద్యమకారుల్లో స్ఫూర్తి నింపేందుకు రైలులో దూసి స్టేషన్‌కు చేరుకున్నారు. వేదిక ఏర్పాటు చేసినప్పటికీ గాంధీ రైలు బోగీ నుంచి దిగి అక్కడే దిశా నిర్దేశం చేశారు. అందరిలో జాతీయోద్యమ స్ఫూర్తి నింపడంతో పాటు అహింసా వాదం, శాంతియుత పోరాటంపై ప్రజలను చైతన్యపరిచారు. అనంతరం అక్కడే ఓ మర్రి మొక్క నాటారు. అది నేడు మహావృక్షంగా మారి చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. అప్పట్లో గాంధీ స్టేషనులో మాట్లాడే తెల్లదొరలను తరిమికొట్టేందుకు ఎంతో ధైర్యాన్ని నింపినట్లు ఉద్యమ నాయకులు తెలిపేవారని నేటికీ దూసి పరిసర ప్రాంతాల్లోని వృద్ధులు చెబుతున్నారు. గాంధీజీ దూసి వస్తున్నారని తెలియగానే వేలాదిగా ప్రజలు తరలి వచ్చారని గుర్తు చేసుకుంటున్నారు.



దూసిలో రైలు దిగుతున్న గాంధీ(పాత చిత్రం)

కాంస్య విగ్రహం.. ఉద్యానవనం..


గాంధీ విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన దిమ్మె

దూసి రైల్వేస్టేషన్‌లో గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ గతంలో దివంగత కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ప్రతిపాదనలు పంపారు. రైల్వే అధికారులు అనుమతులివ్వకపోవడంతో అప్పట్లో అమలుకు నోచుకోలేదు. స్టేషన్‌కు మహాత్మాగాంధీ పేరు పెట్టాలని ఉద్యమ నాయకులు, స్థానికులు కోరినా అడుగులు పడలేదు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవతో శ్రీకాకుళం ఇంటాక్ సంస్థ ప్రతినిధులు ఇటీవల విశాఖపట్నంలో రైల్వే అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఆ మేరకు రైల్వే అధికారులు గత నెల 28న దూసి స్టేషన్‌లో గాంధీజీ పర్యటించిన స్థలాన్ని పరిశీలించారు. అక్కడ గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటుతో వీఐపీ గ్యాలరీ, ఉద్యానవనం, తదితర చేపట్టి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

మొగదాలపాడులో పోలింగ్ కేంద్రం

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: గార మండలం మొగదాలపాడులో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలువురు చేసిన విజ్ఞప్తి పరిశీలించిన తెదేపా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పి.ఎం.జె.బాబు మంగళవారం తెలిపారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా మొగదాలపాడులో కేంద్రం ఏర్పాటుకు మార్గం సుగమమైందన్నారు. ఇక్కడ 1,083 మంది ఓటర్లు రెండు కిలోమీటర్ల దూరంలోని కొమరవానిపేటలో ఓటు వేసేందుకు వెళ్లేవారని, ఇక నుంచి అదే గ్రామంలో ఓటు వినియోగించుకోవచ్చన్నారు. 675 ఓట్లు ఉన్న చల్లవానిపేటలో కేంద్రం ఏర్పాటు చేశారని, ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బెజ్జిపుట్టుగ పోలింగ్ కేంద్రం విడదీసి 1298 మంది ఓటర్లతో దూగానపుట్టుగలో కొత్తగా మరొకటి, పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని కొరాడ సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఒకటి ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 29న జిల్లాలోని 2,537 కేంద్రాల్లో ముసాయిదా జాబితాలు ప్రదర్శిస్తారని తెలిపారు.

నిఘా లేని ఆలయాలే లక్ష్యంగా చోరీలు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: నిఘా లేని ఆలయాలే లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన వివిధ కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆ కేసుల వివరాలను వెల్లడించారు. నిందితులు 2021-24 సంవత్సరాల మధ్య కాలంలో 32 ఆలయాలు, 3 బియ్యం మిల్లులు, నాలుగు ఇళ్లలో చోరీలు చేశారన్నారు. విశాఖ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాల్లోనూ నేరాల్లో పాల్గొన్నట్లు చెప్పారు. మొత్తం 43 నేరాల్లో నిందితులుగా గుర్తించామన్నారు. వారి నుంచి సుమారు రూ.91.38 లక్షల విలువైన 692 గ్రాముల బంగారం, 52.880 గ్రాములు వెండి ఆభరణాలు రూ.3.38,570, నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు కట్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు సీసీ కెమెరాలు లేని ఆలయాలపై దృష్టి సారించి దొంగతనాలు చేస్తున్నారని, సీసీ కెమెరాలుంటే డీవీఆర్‌లు ఎత్తుకుపోయి నీటిలో పడేస్తుంటారన్నారు. ఇదే కేసులో మరో నలుగురిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలీసులు పట్టుకున్నారని చెప్పారు. ఆలయాలు, వ్యాపార సముదాయాలు, ఇళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. కేసుల ఛేదనలో క్రియాశీలకంగా వ్యవహరించిన శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు అవతారం, జె.శ్రీనివాసరావు, ఎస్సైలు సందీప్ కుమార్, లక్ష్మణరావు, నిహార్, వెంకటరావు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.


స్వాధీనం చేసుకున్న ఆభరణాలు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఇతర అధికారులు

అమలాపురంలో నలుగురి అరెస్టు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో నలుగురు జిల్లా వాసులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. మరిన్ని నేరాలు వెలుగులోకి వచ్చాయి. ఆ వివరాలను అమలాపురం ఎస్పీ కృష్ణారావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా గుర్రాలమెట్టకు చెందిన సవర సూర్య, సవర చిన్నారావు, జోగిన లవ, గ్రామవాసి సవర రజని, కారిగాంకు చెందిన బత్తిని శ్రీకాంత్ జల్సాలు, వ్యసనాలకు అలవాటుపడి చోరీల బాట పట్టారు. శ్రీకాకుళం, తెలంగాణకు చెందిన కొంతమందితో కలిసి ముఠాగా ఏర్పడి శివారులో ఉండే దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ దొంగతనాలు చేసినట్లు అనుమానిస్తున్నారు.

గీటు పెట్టమంటే కుచ్చుటోపీ పెట్టాడు..!

❖ యూబీఐలో అప్రైజర్ చేతివాటం ❖ పోలీసులను ఆశ్రయించిన బ్యాంకు అధికారులు

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: ఖాతాదారులు తెచ్చే బంగారు ఆభరణాల నాణ్యతను పరిశీలించి విలువలను నిర్ధారించడం ఆయన విధి. దాన్ని పక్కనపెట్టి పని చేసే బ్యాంకులోనే చేతివాటం ప్రదర్శించాడు. గిల్టు నగలను తనఖాకు పెట్టి వేర్వేరు పేర్ల మీద రుణాలు తీసుకుని అడ్డంగా దొరికిపోయాడు. ఈ ఘటన శ్రీకాకుళం నగరం సింహద్వారం సమీపంలోని యూనియన్ బ్యాంకు వెంకటాపురంశాఖలో చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బ్యాంకులో అప్రైజర్‌గా పని చేస్తున్న రవితేజ గిల్టు బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి తన బంధువులు 8 మంది పేర్ల మీద రూ.16 లక్షల మేర రుణాలు తీసుకున్నారు. కొన్ని రోజుల కిందట విషయాన్ని అధికారులు గుర్తించారు. స్వాహా చేసిన మొత్తాన్ని ఆయన నుంచి రికవరీ చేసే ప్రయత్నం చేశారు. అధికారుల ఒత్తిడి మేరకు కొద్దిరోజుల క్రితం రూ.1.50 లక్షలు మాత్రమే తిరిగి చెల్లించారు. మిగిలింది చెల్లిస్తానంటూ కాలయాపన చేస్తుండగా విషయం బయటకు పొక్కింది. ఉన్నతాధికారులకు తెలిస్తే ఇబ్బందవుతుందనే ఆలోచనతో ఎట్టకేలకు సంబంధిత అప్రైజర్‌పై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదుకు సిద్ధమయ్యారు. యూనియన్ బ్యాంకు ప్రాంతీయ మేనేజర్, లీడ్‌బ్యాంకు మేనేజర్ కార్యాలయం ఉన్న భవనంలోనే ఈ శాఖ కూడా ఉండటం గమనార్హం. ఉన్నతాధికారుల అండతోనే అప్రైజర్ చేతివాటానికి పాల్పడ్డారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై వివరణ కోరేందుకు యూబీఐ ప్రాంతీయ మేనేజర్ తిలక్, లీడ్‌బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్‌లను 'న్యూస్‌టుడే' ఫోన్ ద్వారా ఎంత ప్రయత్నించినా స్పందించలేదు. ఈ క్రమంలో యూబీఐ వెంకటాపురంశాఖ అధికారులు మంగళవారం సాయంత్రం తమ పోలీసుస్టేషన్‌కు పిర్యాదు నిమిత్తం వచ్చారని, వివరాలు సమగ్రంగా లేకపోవడంతో వెనక్కి పంపినట్లు ఎచ్చెర్ల సీఐ వారణాసి సందీప్ తెలిపారు.

పుస్తెల తాడు అపహరణ

ఒకేరోజు వేర్వేరు చోట్ల ఘటనలు

కాశీబుగ్గ, సోంపేట, న్యూస్‌టుడే: ఇద్దరు వివాహితల మెడలో పుస్తెల తాడులు చోరీకి గురయ్యాయి. కాశీబుగ్గ, సోంపేట మండలం కొర్లాంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. కాశీబుగ్గలోని ఓ జీడి కర్మాగారంలో పని చేస్తున్న సంతోషి అనే మహిళ మంగళవారం సాయంత్రం విధులు ముంచుకుని ఇంటికి బయలుదేరారు. కె.టి.రోడ్డులో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని సుమారు 20 గ్రాముల బంగారు పుస్తెల తాడును కాజేశారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ● సోంపేట మండలం కొర్లాంకు చెందిన కలిపిల్లి పుణ్యవతి పొలం పనుల అనంతరం ఇంటికి తిరిగి వెళ్తుండగా గ్రామ ప్రధాన రహదారి వద్ద ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని మూడు తులాల పుస్తెల తాడును లాక్కొని వెళ్లిపోయారు. ఆమె కేకలు వేయగా సమీపంలో ఉన్న వారు పోలీసులకు సమాచారమిచ్చారు. బారువ పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆమెను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెండిగేటు వద్ద బంగారు గొలుసు..

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం బెండిగేటు కూడలి వద్ద ఉద్దానం మెళియాపుట్టి గ్రామానికి చెందిన బొమ్మాళి సరోజనమ్మ మెడలో తులంన్నర బంగారు గొలుసును ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఆమె భర్త లక్ష్మయ్యతో కలిసి పూండి నుంచి గరుడఖండి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. అతను గొలుసు తెంపే క్రమంలో కుదుపునకు గురై ద్విచక్ర వాహనంపై నుంచి దంపతులు కింద పడిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై నిహార్ కేసు నమోదు చేశారు.

వరద బాధితులకు ఆపన్నహస్తం



విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం రూ.1.04 లక్షలు విరాళంగా అందజేసింది. నాలుగు మండలాల పరిధిలోని ప్రతి ప్రైవేటు పాఠశాల యజమాని కొంత మొత్తం సమకూర్చారని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.కృష్ణమూర్తిరెడ్డి తెలిపారు. ఈమేరకు చెక్కును మంగళవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు అందజేశారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

'స్వర్ణాంధ్ర-2047'లో భాగస్వామ్యం కండి



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళిక రూపకల్పనలో ప్రజలందరూ భాగస్వామ్యులై తమ అభిప్రాయాలను తెలియజేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై అధికారులతో మంగళవారం దూరదృశ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మీ కోసంలో వచ్చే ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి అర్జీదారులకు పరిష్కారాలు చూపాలని సూచించారు. ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమంలో ప్రతి వారం కచ్చితమైన పురోగతి కనిపించేలా చూడాలని చెప్పారు. ఆయాశాఖలవారీగా లక్ష్యాలు, ప్రగతి పనులపై సమీక్షించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్, డీఆర్వో అప్పారావు, ఆర్డీవోలు దొర, భరత్‌నాయక్, సీపీవో ప్రసన్నలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, గ్రామ సచివాలయ నోడల్ అధికారి వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ పోటీలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) పోటీలు మంగళవారంతో ముగిశాయి. జిల్లాలో గత 15 రోజులుగా 35 క్రీడాంశాల్లో మూడు వయో విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. వాటికి సుమారు 6 వేల మంది హాజరు కాగా.. 1,400 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.వి.రమణ తెలిపారు. చివరి రోజు మంగళవారం బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్, విలువిద్య పోటీలు జరిగాయి. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి.రమణ, ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు, పి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, సీనియర్ వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.



వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జాతరలో అన్నదానానికి విరాళం



కోటబొమ్మాళి కొత్తమతల్లి జాతరలో మూడు రోజుల పాటు నిర్వహించే అన్నదానానికి తెదేపా రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ అంధవరపు వరం తనయుడు సంతోష్ రూ.లక్ష విరాళాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడి సమక్షంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి అందించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, నాయకులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, గుజరాతీపేట (శ్రీకాకుళం)

మండలానికో పారిశ్రామిక పార్కు: మంత్రి

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో ప్రతి శాఖలో అప్పులు పేరుకుపోయాయని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సంతబొమ్మాళి మండలం నరసాపురంలో మంగళవారం పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో గ్రామ పంచాయతీలకు కేంద్రం రూ.3,500 కోట్లు మంజూరు చేసిందన్నారు. పింఛన్లు పొందే వారిలో అనర్హులు, తప్పుడు ధ్రువపత్రాలు ఉంటే తొలగిస్తామన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. మూలపేట-భోగాపురం హైవేతో పారిశ్రామికంగా జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నారు. ప్రతి మండల కేంద్రంలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రూ.400 కోట్లతో నియోజకవర్గ ప్రజలకు వంశధార నీరు ప్రతి ఇంటికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అచ్చెన్న బుల్లెట్‌ప్రూఫ్ వాహనం మొరాయింపు

టెక్కలి, న్యూస్‌టుడే : మంత్రి అచ్చెన్నాయుడి బుల్లెట్‌ప్రూఫ్ వాహనం మంగళవారం సాంకేతిక సమస్యతో మొరాయించింది. కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన అక్కడ నుంచి పింఛన్ల పంపిణీకి బయలుదేరుతున్న సమయంలో వాహనంలో ఏసీకి సంబంధించిన గ్యాస్‌కిట్ పాడైపోవడంతో పొగలు వ్యాపించాయి. అప్పటికే వాహనం బయట ఉన్న అచ్చెన్నాయుడు వేరే వాహనంలో వెళ్లిపోయారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత సేవలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం.040- 23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.

ఎక్సైజ్‌శాఖలో బదిలీలు

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) విభాగాన్ని ఇటీవల మాతృశాఖ ఎక్సైజ్‌లో విలీనమైన సంగతి తెలిసిందే. అందులో భాగంగా జిల్లాకు కేటాయించిన సీఐలు, ఎస్సైలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఆశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సీఐల్లో ఐఎంల్ డిపోకు సంబంధించి బి.వి.మురళీధర్, మొబైల్ పార్టీలో జి.వి.రమణ(ఇచ్ఛాపురం), కె.సునీల్‌కుమార్(సోంపేట), ఎం.ఇందుమతి(పాతపట్నం) నియమితులయ్యారు. వీరితో పాటు 21 మంది ఎస్సైలకూ స్టేషన్లు కేటాయించారు.

సీఐ పేరు	స్థానం
ఎం.వి.గోపాలకృష్ణ	శ్రీకాకుళం
జి.సతీష్‌కుమార్	ఆమదాలవలస
ఎల్.అనురాధాదేవి	రణస్థలం
వై.రాజు	పొందూరు
ఎస్.వి.రమణమూర్తి	నరసన్నపేట
కె.కృష్ణారావు	పాతపట్నం
బీహెచ్ కిరణ్ మణేశ్వరి	కొత్తూరు
షేక్ మీరా సాహెబ్	టెక్కలి
కె.గాయత్రి	కోటబొమ్మాళి
కె.మల్లికార్జునరావు	పలాస
కె.బాబీ	సోంపేట
పి.డి.ప్రసాద్	ఇచ్ఛాపురం
ఎస్.పిచ్చేశ్వరరావు	ఎన్‌ఫోర్స్‌మెంట్
ఎం.శ్రీనివాసరావు	ఎన్‌ఫోర్స్‌మెంట్
పి.లీలారాణి	టాస్క్‌ఫోర్స్

విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, లేదంటే ఐక్య ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామని అఖిల పక్ష కార్మిక సంఘ నాయకులు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి కళాకారులు చింతాడ రామచంద్రరావు, ఎస్.శ్రీనివాస్ పాటలు పాడుతూ పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ భాజపా మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ స్టీల్ ప్లాంట్ పరిస్థితి మరింత దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మనాయుడు, పి.తేజేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు

సమస్య: పలాస మండలం గంగువాడ ఎస్సీ వీధిలో మురుగు కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

సమాధానం: త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- ఫల్గుణరావు, పంచాయతీ కార్యదర్శి, కేదారిపురం**

? ఇచ్ఛాపురం పట్టణ పరిధి పురుషోత్తపురం త్రినాథ మందిరం సమీపంలో చెత్త పేరుకుపోయింది. **- బి.రామకృష్ణారెడ్డి, ఇచ్ఛాపురం**

● వ్యర్థాలను తొలగించి స్థానికులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తాం. **- పి.ఉపేంద్రకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇచ్ఛాపురం** - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం, ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా
(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం:	9440437129
పలాస :	8008574279
కవిటి గ్రామీణం :	8309638875
పలాస గ్రామీణం:	7386408926
కంచిలి గ్రామీణం:	9704568738

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

సమస్యలు పరిష్కరించరూ..


కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. శ్రీకాకుళంలో మంగళవారం కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్దానంలో కిడ్నీ బాధితులకు శుద్ధజలం అందజేయడానికి ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. కవిటి, సోంపేట ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ రోగులకు తగినన్ని పడకలు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

అర్హులందరికీ పింఛన్లు


పలాసలో సొమ్ము అందజేస్తున్న ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు

పలాస, పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పేదలకు కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరిట పింఛన్లు అందజేసి అండగా నిలుస్తోందని ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం 2, 24 వార్డుల్లో మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు ఎస్.చంద్రమౌళి, దేముడు, జగదీష్ పండా, తదితరులు పాల్గొన్నారు. ● పలాస మండలం మామిడిపల్లికి చెందిన కిడ్నీ బాధితుడు వంకల తాతారావుకు సచివాలయ సిబ్బంది, తెదేపా నాయకులు రూ.10 వేలు పింఛను అందజేశారు. ఎనిమిది నెలలుగా ఆయన డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈ నెల కొత్తగా పింఛను మంజూరైంది. నాయకులు మురిపింటి కుమార్‌రాజు, మరిపింటి ఖగేశ్వరరావు, సార జోగారావు తదితరులు పాల్గొన్నారు. కిష్టుపురంలో ఎంపీడీవో రమేశ్‌నాయుడితో కలిసి డీఎల్‌డీవో చిట్టిరాజు పింఛన్లు పంపిణీ చేశారు.


మామిడిపల్లిలో పింఛను అందజేస్తున్న సచివాలయ సిబ్బంది, తెదేపా నాయకులు

ఆగని రైళ్లు.. ప్రయాణికులకు పాట్లు!

● ఇచ్ఛాపురంలో మరిన్ని నిలిపితే సౌకర్యం
● ఆదాయం పెరగడానికి అవకాశం
● 4న ఖుర్దా డివిజన్ రైల్వే ప్రత్యేక సమావేశం

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఆంధ్రా ముఖద్వార రైలు నిలయం ఇచ్ఛాపురం. ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండటంతో క్రమేపీ ఆదాయం పెరుగుతోంది. ఉద్దానం, ఒడిశాలోని చికిటి, గోపాల్‌పూర్ నియోజకవర్గ ప్రజలు ఇక్కడి నుంచి ఎక్కువగా ప్రయాణం సాగిస్తారు. రూ.పది కోట్ల వార్షికాదాయం, 6.83 లక్షల ప్రయాణికులతో ఎన్ఎస్‌జీ గ్రేడ్ 4 దక్కించుకుంది. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ కృషి ఫలితంగా అమృత్‌భారత్‌లో ఇచ్ఛాపురాన్ని ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నారు. ఇక్కడి సమస్యలు పరిష్కరించి మరిన్ని రైళ్లు ఆగేలా కేంద్ర మంత్రి చొరవ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ నెల 4న ఖుర్దా డివిజన్ పరిధి ఎంపీలతో రైల్వే ఉన్నతాధికారుల ప్రత్యేక సమావేశం భువనేశ్వర్‌లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఇచ్ఛాపురం, సోంపేట ఆర్ఎస్, జాడుపూడి, బారువ, మందస రైలు నిలయ పరిధిలో ప్రయాణికుల అవసరాలపై 'న్యూస్‌టుడే' కథనం.

ఆపాలని కోరుతున్నవి..

ఇచ్ఛాపురంలో హావ్‌డా-యశ్వంత్‌పూర్, విశాఖపట్నం - అమృత్‌సర్ హిరాకుడ్ సూపర్‌ఫాస్ట్, పూరీ-చెన్నై, విశాఖపట్నం-షాలీమార్, పూరీ-గాంధీదామ్ వారపు రైళ్లు, పూరీ-అహ్మదాబాద్ (ఇది రైల్వే బోర్డు పరిశీలనలో ఉంది) ● జాడుపూడి, బారువ రైలు నిలయాల్లో బ్రహ్మపుర-విశాఖపట్నం పాసింజర్ స్పెషల్, ఇంటర్‌సిటీ, పూరీ-గుణుపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ● మందసలో భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్, సోంపేట ఆర్ఎస్‌లో ఫలక్‌నుమా, వివిధ వారపు రైళ్లు.



నిలువ నీడకు నోచుకోని ప్రాంతం


రైలు నిలయం పశ్చిమ ద్వారంగా రూపుదిద్దుకోవలసిన ప్లాట్‌ఫాం

గేటు స్థానంలో ఆర్‌వోబీ

ఉత్తర క్యాబిన్ వద్ద రైల్వే గేటు కారణంగా నిత్యం ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. పట్టణాన్ని, గ్రామీణ ప్రాంతాలను కలిపేలా కొళిగాం రోడ్డులో రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణానికి ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. ఇందుకు అవసరమైన కార్యాచరణ సత్వరమే సాగుతోంది. పలాస సీనియర్ సెక్షన్ ఇంజినీర్ వద్ద పరిశీలనలో ఉన్న దస్త్రం కదిలేలా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కృషి చేయాలి. ● సమత ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం నుంచి విజయనగరం మీదుగా హజరత్ నిజాముద్దీన్‌కు వారానికి ఐదు రోజులు నడుపుతున్నారు. మిగిలిన రెండు రోజులూ విజయనగరం మీదుగా హజరత్ నిజాముద్దీన్‌కు బ్రహ్మపుర నుంచి కొత్త రైలును నడిపితే ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రజలకు ఎంతో ఉపయోకరం. విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్ నుంచి లింగంపల్లికి పొడిగిస్తే వలస కార్మికులకు ఉపయోగపడుతుంది.

పశ్చిమ ద్వారం అవసరం

ఇచ్ఛాపురం రైలు నిలయ అభివృద్ధికి రత్నకన్న వైపు రెండో ప్రధాన ద్వారం ఏర్పాటు చేయడం అవసరం. ఈ సౌకర్యం కోసం సర్వేలు చేసి స్థలాన్ని గుర్తించారు. ప్రస్తుతం మూడు ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. నాలుగో ప్లాట్‌ఫాం సహా పశ్చిమ ముఖద్వారం ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం అమృత్ భారత్‌లో ప్రతిపాదించిన ప్రకారం కాలినడక వంతెన తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ, రైలు నిలయంలో ప్లాట్‌ఫాంలు మారేలా తీర్చిదిద్దాలి. పశ్చిమ ప్రాంతం వైపు ఆంధ్రా, ఒడిశా గ్రామాల వారికి సౌకర్యం కల్పించినట్లవుతుంది.

కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లా..

ఉత్తరాంధ్ర పరిధిలో రైలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడికి లేఖ ద్వారా నివేదించాం. ఇచ్ఛాపురం, జాడుపూడి, మందస, బారువ రైలు నిలయాల్లో రైళ్ల హాల్టులు, ఇచ్ఛాపురం రైలు నిలయ అభివృద్ధి పనులను ప్రస్తావించాం. ఇచ్ఛాపురం నుంచి విజయనగరం పరిధిలో ప్రయాణికులు విజయవాడ, గుంటూరు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి భువనేశ్వర్ లేదా బ్రహ్మపురం నుంచి రాత్రి వేళ నడిచేలా కొత్త రైలును ప్రారంభిస్తే మేలు. ఖుర్దా డివిజన్ సమావేశంలో ఈ అంశాలను కేంద్ర మంత్రి ప్రస్తావిస్తారని ఆశిస్తున్నాం.
- కె.సూర్యప్రకాశరావు, జడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు, ఇచ్ఛాపురం



ఇచ్ఛాపురంలో ఆకట్టుకున్న విద్యార్థి వేషధారణ


కంచిలిలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

కంచిలి, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని పలు కళాశాలల్లో మంగళవారం స్వాగతోత్సవం ఘనంగా నిర్వహించారు. కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కాశీబుగ్గలోని ప్రజ్ఞ జూనియర్, డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం విద్యార్థినులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి.

ప్రహరీ లేక ఇక్కట్లు



వజ్రపుకొత్తూరు మండలం రెయ్యిపాడు పంచాయతీ పరిధి బత్సవాలవానిపేట ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేదు. ప్రధాన రహదారి పక్కన ఉండటంతో వాహనాల రద్దీ ఎక్కువ. విద్యార్థులు బయటకు వచ్చే సమయంలో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ప్రహరీ నిర్మించాలని ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై ఎంఈవో-2 దశరథను 'న్యూస్‌టుడే' సంప్రదించగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

అసంపూర్తి నిర్మాణం పూర్తయ్యేనా?

కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురంలో రూ.20.08 లక్షల వ్యయంతో చేపట్టిన వెల్‌నెస్ కేంద్ర నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. సచివాలయ భవనం నిర్మాణంలో ఉండటంతో ప్రస్తుతం పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గదులు ఇరుకుగా ఉండటంతో అవస్థలు పడుతున్నామని వైద్యారోగ్య సిబ్బంది వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ జేఈ హిమసాగర్‌ను సంప్రదించగా 80 శాతం మేర నిర్మాణం పూర్తయిందని.. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మిగిలిన పనులు పూర్తి చేస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం



పొంచి ఉన్న ప్రమాదం



వజ్రపుకొత్తూరు మండలం బెండిగేటు నుంచి వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి మీదుగా తాళభద్ర వరకు రెండు వరుస రహదారి నిర్మిస్తున్నారు. విస్తీర్ణం పెరగడంతో ముందుగానే విద్యుత్తు స్తంభాలను దూరంగా మార్చాల్సి ఉన్నా చర్యలు తీసుకోలేదు. వజ్రపుకొత్తూరు నుంచి డోకులపాడు, చినబాడం మధ్య రోడ్డుకు ఆనుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల గరుడఖండి-చినబాడం మధ్య స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయమై విద్యుత్తు శాఖ ఏఈ జీవీ రమణను 'న్యూస్‌టుడే' సంప్రదించగా రహదారికి ఆనుకుని ఉన్న లైను మార్పిడికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

బడి భవనాలు వృథా

కవిటి మండలం జుత్తుపుట్టుగలో తెదేపా పాలనలో ప్రాథమిక పాఠశాల మంజూరు చేసి రెండు భవనాలు నిర్మించారు. ఇక్కడ పిల్లలు తక్కువగా ఉన్నారని విద్యాశాఖ అధికారులు నాలుగేళ్ల కిందట బడిని మూసివేయడంతో భవనాలు వృథాగా మారాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కె.రవికుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



తీరంలో అక్రమ తవ్వకాలు



వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట, హుకుంపేట, కొత్తపేట, కేఆర్‌పేట, డోకులపాడు, మెట్టూరు సముద్ర తీరాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రి వేళ ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఇళ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ తవ్వకాలతో తుపానుల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తీర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉప తహసీల్దారు గిరిరాజును 'న్యూస్‌టుడే' సంప్రదించగా అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

చెకుముకి పోటీల్లో సత్తా


మందస మండలం అంబుగాంలో ప్రథమ స్థానం సాధించి బహుమతులు అందుకున్న హరిపురం విద్యార్థులు

హరిపురం (మందస), ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, కవిటి, న్యూస్‌టుడే: పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్ సంబంధిత అంశాలపై పరీక్షలు పెట్టారు. విజేతలకు నిర్వాహకులు, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.


కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విజేతలతో ఉపాధ్యాయులు


ఇచ్ఛాపురం మండలం బలరాంపురంలో నవదుర్గల వేషధారణ


పలాస మండలం రామకృష్ణాపురంలో..

దసరా ముందస్తు వేడుకలు

ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం గ్రామీణం, కవిటి గ్రామీణం, పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల్లో మంగళవారం దసరా ముందస్తు వేడుకలు నిర్వహించారు. పలువురు విద్యార్థినులు అమ్మవారి వేషధారణలో తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కవిటి మండలం ఎర్రగోవిందపుట్టుగలో..



తాగునీటి సరఫరాకు చర్యలు


పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి శాసనాం గ్రామస్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు'లో గత నెల 30న 'దాహం..దాహం' శీర్షికతో ప్రచురితమైన కథనంపై లొద్దభద్ర పంచాయతీ కార్యదర్శి శరత్ స్పందించారు. ఒక్క రోజులోనే మరమ్మతులు చేయించి మంగళవారం కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

స్పందనకు వందనం

రహదారి శుభ్రం చేశారు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణం సంతపేట నుంచి బెల్లుపడ ఛానల్ వంతెన ప్రాంతం వరకూ రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరగడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు'లో ఈ నెల ఒకటో తేదీన 'ముళ్ల పొదలు తొలగించరూ' శీర్షికతో కథనం ప్రచురితమైంది. పురాధికారులు స్పందించి యంత్రం సాయంతో పనికిరాని మొక్కలు, ముళ్ల చెట్లను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. పుర పారిశుద్ధ్య విభాగాధికారి పి.ఉపేంద్రకుమార్ పర్యవేక్షించారు.

నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



ఇచ్ఛాపురంలో కొలువైన స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 3 నుంచి 9 రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. ఆలయాన్ని విద్యుద్దీపాలు, చలువ పందిళ్లతో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేకంగా వేదికలు సిద్ధం చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు రానున్నారని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సంక్షిప్త సమాచారం

స్వచ్ఛత పాటిస్తే ఆరోగ్యకర సమాజం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: స్వచ్ఛత పాటించడం ద్వారా ఆరోగ్యకర సమాజాన్ని సాధించవచ్చని పట్టణ ఎస్సై ఇ.చిన్నంనాయుడు, పురపాలక సంఘ పారిశుద్ధ్య విభాగాధికారి పి.ఉపేంద్రకుమార్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చైతన్య ప్రదర్శన నిర్వహించారు. ప్రజా శౌచాలయాలు, వాటి పరిసరాలను శుభ్రం చేశారు. జ్ఞానభారతి సంస్థ విద్యార్థులు ప్రదర్శనగా వెళ్లి బస్టాండు కూడలిలో ప్రతిజ్ఞ చేశారు.

యువత రక్తదానం

హరిపురం (మందస): మండల పరిధి హరిపురంలో మంగళవారం రెండు కళాశాలల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు రక్తదానం చేశారు. జెమ్స్ ఆసుపత్రి వైద్య బృందం సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశాంత్, ఈశ్వరరావు, తిరుపతిరావు, శివ, తాతారావు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య మిత్రుల ఆర్థిక సాయం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి గ్రామానికి చెందిన పొల్లాయి మండల నాగభూషణం అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు ఆయనకు అండగా నిలిచారు. ఈదుపురం ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం నాగభూషణంకు రూ.30 వేలు అందజేశారు. ఆర్.దేవరాజు, ఎన్.ప్రసాద్, భగీరథి మజ్జి, గిరిధర, మార్కండేయ మజ్జి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి చేయూత

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి డొంకూరు గ్రామానికి చెందిన పేద విద్యార్థి దయాసాగర్ చికిత్స నిమిత్తం ఎస్‌జీఎఫ్ సంస్థ, సాలినపుట్టుగ యువత రూ.15,300 సమకూర్చారు. బాలుడి కుటుంబ సభ్యులకు మంగళవారం సొమ్ము అందజేశారు.

విజేతకు అభినందన

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 అంశంపై మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో రత్తకన్నలోని వినాయక విద్యానికేతన్ విద్యార్థి జి.ప్రేమ్‌కుమార్ విజేతగా నిలిచాడు. ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో సత్తా చాటాడు. బాలుడిని ఎంఈవో కె.అప్పారావు అభినందించి జ్ఞాపిక అందజేశారు.

రచయిత మృతికి సంతాపం


కామేశ్వరరావు (పాత చిత్రం)

పలాస, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం బైపల్లికి చెందిన చీకటి కామేశ్వరరావు (82) కన్నుమూశారు. ఆయన తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేసి కాశీబుగ్గలో నివాసం ఉంటున్నారు. పలు కథలు, గేయాలు, నాటకాలు, నాటికలు, కవితా పుస్తకాలు రచించారు. కామేశ్వరరావు మృతి పట్ల బద్రి కూర్మారావు, వి.రాజారావు, టి.కృష్ణమూర్తి, కుమార్‌నాయక్, కోటేశ్వరరావు, వైద్యుడు రామినాయుడు, సాహితీ కళాకారులు సంతాపం తెలిపారు.


సోంపేట మండలం పాలవలసలో క్రీడాకారులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సోంపేట, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి పాఠశాల పోటీల్లో పాలవలస ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి హాకీ, కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వారిని ప్రధానోపాధ్యాయుడు టి.కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు. ఇచ్ఛాపురంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు క్రికెట్, నెట్‌బాల్ రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ దుంపల వైకుంఠరావు తెలిపారు.

జనసేన జెండా ఆవిష్కరణ

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి ఉద్దానంగోపీనాథపురంలో మంగళవారం జనసేన జెండాను ఆ పార్టీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త డా.దుర్గారావు ఆవిష్కరించారు. తెదేపా గ్రామ అధ్యక్షుడు ఎం.జోగారావు, అర్జి తులసీరావు, కె.ఈశ్వరరావు, శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయండి



నిరసన తెలుపుతున్న నాయకులు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్నికల హామీల అమలుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐకేఎం, ఏఐఏఆర్ఎల్ఏ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. పలాస మండలం బొడ్డపాడు, మాకన్నపల్లి గ్రామ సచివాలయాల ముందు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కోరిన వారందరికీ పని కల్పించి కార్డులు మంజూరు చేయాలన్నారు. నాయకులు బొడ్డు వాసుదేవరావు, మద్దిల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


ఎమ్మెల్సీ రఘువర్మను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కంచిలి గ్రామీణం, సోంపేట, న్యూస్‌టుడే: మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మ సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తున్న తనకు ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. పలువురు ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుపై సోంపేట ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.దాలిబందు, చంద్రశేఖర్ తదితరులు పలు అంశాలపై చర్చించారు.

కేంద్ర మంత్రికి వినతి

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని తెదేపా కంచిలి మండల నాయకులు శ్రీకాకుళంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిశారు. పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పెద్ద శ్రీరాంపురంలో బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణ పనులు సాంకేతిక కారణాలతో నిలిపివేశారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో మాదిన రామారావు, బొడ్డ హరిబాబు తదితరులు ఉన్నారు.

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

దశలవారీగా అభివృద్ధి: మంత్రి అచ్చెన్న

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తపేటలో బాలకృష్ణ అభిమానులు నిర్మించిన ఆలయాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. కొత్తపేటలోని కొత్తమ్మతల్లి ఆలయాన్ని మంగళవారం సందర్శించారు. కోటబొమ్మాళి, కొత్తపేట ప్రాంతాలకు విద్యుదీకరణ చేశామన్నారు. ● అంతకుముందు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కొత్తపేటలో అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

మురుగునీటి విషయమై ఘర్షణ.. ఆరుగురిపై కేసు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : రావివలస పాతకాలనీలో మురుగునీటి విషయమై తలెత్తిన వివాదం మంగళవారం ఘర్షణకు దారితీసింది. రెండుకుటుంబాలకు చెందిన వ్యక్తులు పరస్పరం దాడులు చేసుకోవడంతో పోలీసులు ఆరుగురిపై కేసు నమోదుచేశారు. గ్రామానికి చెందిన శేఖర్, అతడి భార్య మోహిని, అక్క లక్ష్మితో పాటు ఎదురింట్లో ఉంటున్న దాసరి బుగ్గమ్మ, ఆమె కొడుకులు కృష్ణ, మల్లేశ్‌లపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. శేఖర్ ఇంటినుంచి ఇల్లు కడిగిన నీరు తమ ఇంటివైపు వస్తుందన్న కారణంతో ఈ రెండు కుటుంబాలు ఘర్షణకు దిగి దాడులు చేసుకున్నట్లు చెప్పారు.

నాణ్యత లేని పనులపై ఆగ్రహం

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: కేజీబీవీ జూనియర్‌కళాశాల అదనపుతరగతుల పనుల తీరుపై సర్వశిక్ష ఏఈ రామానందం ఆగ్రహం వ్యక్తంచేశారు. మరుగుదొడ్డి ట్యాంకు పనులు ఇసుకతో కాకుండా క్రషర్ బూడిద వినియోగిస్తుండటంతో గుత్తేదారుపై మండిపడ్డారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.



గుత్తేదారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఏఈ రామానందం

నాడు-నేడు అవస్థలు చూడు

అసంపూర్తిగా నిలిచిన పాఠశాల భవనాలు

విద్యారంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్న గత పాలకుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. నాడు - నేడు పనుల కింద పాఠశాలలు అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన గత ప్రభుత్వం, బిల్లులు చెల్లింపులో జాప్యం చోటు చేసుకోవడంతో పనులు ఆగిపోయాయి.



మధ్యలో నిలిచిపోయిన కస్తూర్బా గురుకుల పాఠశాల భవనం పనులు

జలుమూరు, నరసన్నపేట, సారవకోట, పోలాకి, నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే

జలుమూరు మండలానికి మొదటి విడతలో 38 పాఠశాలలకు నిధులు మంజూరు కాగా దాదాపు పనులు పూర్తయ్యాయి. రెండో విడతలో 21 పాఠశాలలకు నిధులు అందినా పనులు జరగలేదు. పాగోడు, లింగాలపాడు, జలుమూరు, కేజీబీవీ పాఠశాల, యలమంచిలి, అచ్యుతాపురం, తిమడాం, పెద్దదూగాం పాఠశాల పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. నిధులు ఉన్నాయని త్వరలో పనులు పూర్తి చేస్తామని ఎంఈవో బమ్మిడి మాధవరావు తెలిపారు. ● నరసన్నపేట మండలంలోని 38 పాఠశాలలకు నరసన్నపేట మండలంలో నిధులు మంజూరు కాగా చాలా వరకు పనులు పూర్తి చేశారు. కిటికీలు, తలుపులు లేక పనులు ముందుకు సాగలేదు. లుకలాం, ఉర్లాం, బాడాం, సుందరాపురం, బొరిగివలస, కంబకాయ, బొర్డు స్కూలు మొదలగు పాఠశాలల అదనపు భవనాల పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. ఎంఈవో ఉప్పాడ శాంతారావు వద్ద ప్రస్తావించగా తల్లిదండ్రుల కమిటీలు మారాయని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.



ఉర్లాం పాఠశాలలో ఆగిపోయిన నిర్మాణం

చివరి దశలో చేతులెత్తేశారు

సారవకోట మండలంలో 12 పాఠశాలలకు నిధులు రాగా సారవకోట కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో 8 తరగతి గదులకు, బుడితి ఉన్నత పాఠశాలలో 3 అదనపు గదులు, చిన్నకిట్టాలపాడు పాఠశాలకు 2 గదులు మంజూరయ్యాయి. పనులు చివరి దశలో నిలిచిపోయాయి. ● పోలాకి మండలంలో రెండో విడత నాడు-నేడు పనులకు గాను 37 పాఠశాలలకు రూ.7.75 కోట్ల నిధులు వచ్చినా నిర్మాణాలు జరగలేదు. ఈదులవలస, అంప్లాం, గుప్పిడిపేట, గొల్లలవలస తదితర పాఠశాలల పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీనిపై సమగ్ర శిక్ష పథకం ఇంజినీరు రమానంద్ మాట్లాడుతూ నిధులు ఉన్నమేర పనులు పూర్తిచేశామని విడుదలైన వెంటనే పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పండగొచ్చింది.. ఊరు పరవశించింది



కొత్తమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తుల కోలాహలం, మొక్కుల చెల్లింపులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. జాతర సందర్భంగా నిర్వహించిన ఆటలు సందడి తీసుకొచ్చాయి. ఈదుపురాయి, శీటరాయి పోటీల్లో గోవిందరావు ప్రథమ, సత్యనారాయణ ద్వితీయ స్థానాల్లో నిలవగా, కబడ్డీ పోటీల్లో ఎనిమిది జట్లు నాకౌట్ దశకు చేరుకున్నాయి. ఆమదాలవలస మండలం గాజుల కొల్లివలసకు చెందిన గేదెల హరికృష్ణ రూపొందించిన అమ్మవారి సైకత శిల్పంతోపాటు కేంద్ర, రాష్ట్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు ప్రతిమలు ఆకట్టుకున్నాయి.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి



బాహాడపల్లి- కృష్ణా మధ్య కబడ్డీ పోటీలు



కోటబొమ్మాళిలో ఈదుపురాయి పోటీలను తిలకిస్తూ..

దొంగిలించి.. వేరే చోట వదిలేసి

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఇళ్ల ముందు తాళం వేసి ఉంచిన ద్విచక్రవాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు యథేచ్ఛగా చోరీ చేస్తున్నారు. అనంతరం వాటిని కొంత దూరం తీసుకెళ్లి విడిచి పెడుతున్నారు. నరసన్నపేట సమీపంలోని జాతీయ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు గత వారం రోజులుగా ఉన్నాయి. నరసన్నపేట మండలం తామరాపల్లి గ్రామానికి చెందిన గొద్దు జోగారావు ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఈ వాహనం జమ్ము సమీపంలోని తోటల్లో పడేశారు. బైరి మల్లేశ్‌కు చెందిన వాహనం స్పిన్నింగ్ మిల్లు వద్ద వదిలేశారు. జమ్ము కూడలి సమీపంలో క్లారెట్ స్కూలు ఆవరణలో జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై గత వారం రోజులుగా రెండు ద్విచక్రవాహనాలు ఉంచి వెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్సై దుర్గా ప్రసాద్ ఈ వాహనాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. వాహనాల యజమానులకు సమాచారం అందించారు. నేరం చేసేందుకు దొంగిలించి పని పూర్తయ్యాక వదిలేసి వెళ్లి ఉంటారని భావిస్తున్నారు.



జమ్ము సమీపంలో ఓ తోటల్లో విడిచి పెట్టిన ద్విచక్రవాహనం

ఆపేసి రెండేళ్లు



గొల్లలవలస గ్రామంలో నిర్మిస్తున్న పల్లె ఆరోగ్య కేంద్రం రెండేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పనులు ముందుకు కదల్లేదు. తొలి దశలో రూ.17.30 లక్షలు మంజూరు కాగా తరువాత మరో రూ.3 లక్షలు ప్రభుత్వం కేటాయించినా గుత్తేదారు భవనాన్ని పూర్తి చేయలేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల ఇంజినీర్ కీర్తన వద్ద ప్రస్తావించగా గుత్తేదారుకు చెప్పామని మరోసారి మాట్లాడతామని తెలిపారు.

–న్యూస్‌టుడే, పోలాకి

నీరుగారిన సంకల్పం

నరసన్నపేట మండలం బాలసీమలో చెత్తను సేకరించే మూడు చక్రాల సైకిళ్లను వినియోగించక మూలన పడేశారు. వేలాది రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన సైకిళ్లు తుప్పు పట్టి పనికి రాకుండా పోతున్నాయని, వాటికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకుని రావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ రామకృష్ణరావు దృష్టికి తీసుకు వెళ్లగా వాటికి మరమ్మతులు చేసి వినియోగించేలా చేస్తామని తెలిపారు.

–న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం



కాపలా కాయాల్సిందే



నందిగాం మండలం లఖిదాసుపురం ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేదు. పాఠశాలకు ఆనుకుని సమీపంలో ఉన్న రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. పిల్లలు రోడ్డుపైకి వెళతారన్న భయంతో విరామ సమయంలో కాపలా కాస్తున్నామని, పొరపాటును వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు తెలిపారు. ప్రహరీ నిర్మించాలని కోరారు. ఎంఈవో వద్ద విషయం ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, నందిగాం

అధ్వానానికి అద్దం.. ఈ మార్గం

హిరమండలం, న్యూస్‌టుడే: జిల్లాలో ఎంతో ప్రాధాన్యత కలిగిన గొట్టాబ్యారేజీ వద్ద ప్రధాన కార్యాలయం ముందు బీటీ రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. రహదారి ఛిద్రమై గుంతలుగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు చేరి ఇబ్బందికరంగా తయారవుతోంది. హిరమండలం, పాతపట్నం, శ్రీముఖలింగం, కొత్తూరు, బొంతు, జలుమూరు వైపు వెళ్లే ప్రధాన రహదారి కూడలి కావడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల భవనాల డీఈఈ సాగర్ మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



పగలే వెలుగులు

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోట మండలంలోని వెంకటాపురం పంచాయతీ శివరాంపురం గ్రామంలో మంగళవారం వీధి దీపాలన్నీ వెలుగుతునే ఉన్నాయి. సచివాలయ ఉద్యోగులు ఆ మార్గంలోనే పింఛన్లు పంపిణీ చేసినా.. చర్యలు తీసుకోలేదని స్థానికులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కె.సుశీల వద్ద ప్రస్తావించగా విద్యుత్తు సహాయకుడికి తెలియజేసి సమస్య పరిష్కరిస్తామన్నారు.



విజ్ఞానం పెంపొందించేందుకే చెకుముకి పోటీలు

శాస్త్ర సాంకేతిక విజ్ఞానం విద్యార్థుల్లో పెంపొందించేందుకు సైన్సు ఎంతగానో దోహదపడుతుందని ముఖ్య అతిథులు తెలిపారు. మూడు నియోజకవర్గాల్లోని జరిగిన మంగళవారం జరిగిన చెకుముకి పోటీలు సందడిగా జరిగాయి. పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. –న్యూస్‌టుడే, బృందం



జలుమూరు: ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయుడు అప్పలసూర్యనారాయణ

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



హిరమండలం: తంప వ్యవసాయ క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సంధ్య, వ్యవసాయ సహాయకులు

వరిలో ఆశించే చీడ పీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు. మంగళవారం మూడు నియోజకవర్గాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆధునిక పద్ధతులు పాటించి వరి పైరుపై తెగుళ్ల నివారణ, అధిక దిగుబడుల సాధనపై అవగాహన కలిగించారు. అవసరం మేరకే రసాయనిక ఎరువులు వినియోగించాలన్నారు. – న్యూస్‌టుడే, బృందం

సంక్షిప్త సమాచారం

జాతీయస్థాయి పోటీల్లో మహిళా కానిస్టేబుల్ ప్రతిభ

టెక్కలి, న్యూస్‌టుడే : ఆలిండియా పోలీస్ వెయిట్‌లిఫ్టింగ్ క్లస్టర్ విభాగం, యోగా మహిళా విభాగం పోటీల్లో టెక్కలికి చెందిన మహిళా కానిస్టేబుల్ పల్లి శిరీష కాంస్యపతకం సాధించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయ్‌లో ఈ పోటీలు జరిగాయి. ఆమెను డీజీపీ తిరుమల రావు, ఎస్పీ మహేశ్వరరెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పాతపట్నం, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి ఆంధ్రకు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ సాయి తెలిపారు. పాతపట్నం మేజరు పంచాయతీ పరిధిలోని అచ్యుతాపురం కూడలి వద్ద ఎస్.ఐ. లావణ్య తనిఖీలు చేస్తుండగా 1170 గ్రాముల సరకు అతడి వద్ద గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు.

వృద్ధుల వైద్య పరీక్షలకు ప్రత్యేక వార్డు

నరసన్నపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వృద్ధులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి సేవలందించనున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కల్యాణబాబు అన్నారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో వృద్ధుల పరీక్షలకు ప్రత్యేక వార్డు ప్రారంభించారు.

వైద్య విద్యార్థులకు అభినందన

పాతపట్నం, మెళియాపుట్టి, పోలాకి, ఎల్ఎన్‌పేట న్యూస్‌టుడే: పేద ప్రజలకు విలువైన వైద్య సేవలందించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మంగళవారం ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందించారు.

● మకుందాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఎమ్మెల్యే నూతనంగా ఆవిష్కరించారు. ● ముంగెన్నపాడు గ్రామంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 100 మందికి ఉపాధి కల్పించేలా పాతపట్నంలో సాఫ్ట్‌వేర్ కంపెనీల ఏర్పాటు చేస్తామని తెలిపారు. ● ఈదువలస ఆదర్శపాఠశాల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా గుర్తింపు పొందేలా 'పది' ఫలితాలు రావాలని అక్కడ నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు.



మద్యం దుకాణాల మూత

ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సిబ్బంది మంగళవారం మెరుపుసమ్మె చేపట్టారు. దీంతో దుకాణాలు మూతపడ్డాయి. అక్టోబరు 1తో ముగిసిన ప్రభుత్వ ఒప్పందం పూర్తయినందున విధుల్లో చేరబోమని స్పష్టం చేశారు.

– నరసన్నపేట, జలుమూరు, హిరమండలం

తాగునీరు పునరుద్ధరణ

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలోని వడ్డినవలస కాలనీకి సమీపంలోని మంచి నీటి పథకం ట్యాంకు నుంచి మూడు కుటుంబాలకు నీరు వెళ్లకుండా డమ్మీ పరికరాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో చర్యలు తీసుకుని నీరు పునరుద్ధరించారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు

కొత్తూరు, న్యూస్‌టుడే: చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు ఉంటాయని ప్రకృతి సేద్యం రాష్ట్ర బృందం సభ్యుడు దేవుళ్లు, సహాయ డీపీఎం ధనంజయరావు అన్నారు. మండలంలోని అల్తి పంచాయతీ పరిధిలో గులిరాగి పంటను మంగళవారం పరిశీలించారు.

అరసవల్లి అర్చకులకు సత్కారం

కోటబొమ్మాళి, జలుమూరు, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాల్లో అరసవల్లి దేవస్థాన అర్చకులు ప్రత్యేకంగా భాగస్వామ్యులయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఈ బృందానికి దేవాదాయ, ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, కొత్తమ్మతల్లి ఉత్సవాల సీఎఫ్‌వో భద్రాజీ, కొత్తమ్మతల్లి ఆలయ ప్రధాన అర్చకులు సుసరాపు గణపతిశర్మ తదితరులు సత్కరించారు.

● శ్రీముఖలింగేశ్వరస్వామి వారాహి అమ్మవారి సన్నిధిలో గురువారం నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు ముస్తాబు చేశారు. నవ రాత్రులు సందర్భంగా వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపిక

సంతబొమ్మాళి,న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన 12 మంది పూర్వ విద్యార్థులు అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ భీమేశ్వరరావు వారిని అభినందించారు.

బస్సు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి- నౌపడా మార్గంలో మున్సబుపేట గ్రామంవద్ద మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో తెలినీలాపురం గ్రామానికి చెందిన దుశ్యంత్‌కుమార్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. టెక్కలి నుంచి స్కూటీపై గ్రామానికి వెళ్తున్న సమయంలో పూండి నుంచి టెక్కలి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం శ్రీకాకుళం తరలించారు.



ఆకట్టుకున్న ప్రదర్శన

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలోని అవలంగి గ్రామ జేబీటీ పాఠశాల విద్యార్థులు మంగళవారం చేపట్టిన అంకెల రూప ప్రదర్శన ఆకట్టుకుంది. లాల్ బహుదూర్ శాస్త్రి 120వ జయంతిని, మహాత్మగాంధీ 155వ జయంతి సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు జె.మోహన్‌గాంధీ విద్యార్థులతో అంకెల రూపంలో ప్రదర్శన చేపట్టారు.



నరసన్నపేట: దేవాదిలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే బగ్గు



పాతపట్నం: కాగువాడలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

సంక్షేమమే అభిమతం

సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు అభిమతమని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. – న్యూస్‌టుడే, బృందం

శ్రీకాకుళం
●శ్రీకాకుళం ●ఆమదాలవలస ●ఎచ్చెర్ల

నేడు మాంసం దుకాణాల బంద్

శ్రీకాకుళం నగరం న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ పరిధిలోని మాంసం, చేపల దుకాణాలను మూసివేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా దుకాణాలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా అపరాధ రుసుం వసూలు చేస్తామని, నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన పేర్కొన్నారు.

తెరపై ఈనాడు

● కీర్తన: సరిపోదా శనివారం ● కీర్తిక: దేవర ● కిన్నెర సినీమాక్స్: సత్యం సుందరం ● ఎస్‌వీసీ (రామలక్ష్మణ): దేవర ● సూర్యమహల్: దేవర ● సరస్వతి: దేవర ● చంద్రమహల్: మత్తు వదలరా-2 ● మారుతి: దేవర – న్యూస్‌టుడే, అరసవల్లి

విద్యార్థికి అభినందనలు

పొందూరు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్.నాగహర్షవర్ధన్ విశాఖపట్నంలో జరిగిన జిల్లాస్థాయి దివ్యాంగుల పోటీల్లో పాల్గొని షాట్‌పుట్, డిస్కస్‌త్రో విభాగాల్లో ప్రథమ సాధించాడని ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు డి.ఉదయ్‌కుమార్, ఎస్.వి.రమణ, రజనీకుమారి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. – న్యూస్‌టుడే, పొందూరు


ప్రతిభ చూపిన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పేదలకు అండగా ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్వహించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను అందించారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. – న్యూస్‌టుడే బృందం


పొందూరు: కేశవదాసుపురంలో పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్


ఆమదాలవలస పట్టణం: పాతినవారివీధిలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్


ఎచ్చెర్ల: అజ్జరాంలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎంత చెప్పినా తలకెక్కించుకోవట్లే..!

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

వాహనదారులు ప్రాణాలకు ముప్పులేకుండా విధిగా శిరస్త్రాణం ధరించాలంటూ పోలీసులు ఎంత మొత్తుకున్నా చోదకులు ఆ మాటలను పెడ చెవిన పెడుతున్నారు. ర్యాష్ డ్రైవింగ్, హరన్ కొడుతూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఎక్కువ శాతం మైనర్లే వాహనాలు నడపటంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు. శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా కేసులు నమోదు చేస్తున్నారు. తోటి ప్రయాణికులకు హాని కలిగించేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకుని, అపరాధరుసుం విధిస్తున్నారు.


శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడుపుతున్న చోదకులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించని చోదకులు

శిరస్త్రాణం ధరించకుండానే..

నగరంలో శిరస్త్రాణం ధరించకుండా ప్రయాణించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వాహనాలు ఢీ కొని కిందపడి తలకు గాయమై ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికీ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు శిరస్త్రాణం ధరించడంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునే ఉన్నారు. అయినప్పటికీ వాటిని ఎవరు తలకెక్కించుకోవట్లేదు.

అపరాధ రుసుం విధిస్తున్నా..

ట్రాఫిక్ పోలీసులు శిరస్త్రాణం ఉపయోగించని వాళ్లకు అపరాధ రుసుం విధిస్తున్నారు. నగరంలో అన్ని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్, సివిల్ పోలీసులు విస్తృతంగా కేసులు నమోదు చేస్తున్నారు. నిత్యం 100 నుంచి 200 మందిపై రుసుం విధిస్తున్నా వాహనదారులు భయపడే పరిస్థితిలేకుండా పోయింది. మైనర్లు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారు. వీరిపై పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సి ఉంది. ట్రిబుల్, ర్యాష్ డ్రైవింగ్, మార్పు చేసిన సైలెన్సర్‌ను వినియోగించడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా అలాంటి వారిపై అపరాధరుసుం విధిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం.. శిరస్త్రాణం ధరించకుండా డ్రైవింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. దీనిపై అవగాహన కల్పిస్తున్నాం. శిరస్త్రాణం పెట్టకపోతే అపరాధరుసుం విధిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. – వి.నాగరాజు ట్రాఫిక్ సీఐ, శ్రీకాకుళం

నూతన కార్యవర్గ ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర విపత్తులు, స్పందన శాఖ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం శ్రీకాకుళం నగరంలో జరిగింది. అధ్యక్షుడిగా కె.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కె.సత్యనారాయణ, కార్యదర్శిగా టి.జగన్నాథం, సంయుక్త కార్యదర్శిగా ఎస్.నీలాచలం, కోశాధికారిగా డి.రవికుమార్, సలహాదారుడిగా జి.రమణమూర్తి ఎన్నికయ్యారు. జిల్లా అదనపు అగ్నిమాపకశాఖాధికారి ప్రసాదరావు వారితో ప్రమాణం స్వీకారం చేయించారు.

స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నేడు

శ్రీకాకుళం నగరం: గాంధీజయంతి సందర్భంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో అరసవల్లి కూడలి 80 అడుగుల రహదారి, డచ్‌బంగ్లా వరకు స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ ఉంటుందని నిర్వాహక ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక సంస్థ, వార్డు సచివాలయ సిబ్బంది, నగర ప్రజలు ఈ ర్యాలీ లో పాల్గొనాలని వారు కోరారు. అనంతరం జరుగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

బూర్జ, న్యూస్‌టుడే : ఇసుక రవాణా విషయంలో అక్రమాలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. బూర్జ మండలం కాఖండ్యాం ఇసుక రీచ్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. దస్త్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. మైనింగ్ అధికారులు, స్థానిక తహసీల్దారు జె.ఈశ్వరమ్మ, ఆర్ఐ వెంకటరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.


కాఖండ్యాం ఇసుక రేవు వద్ద దస్త్రాలను తనిఖీ చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

సనాతన ధర్మ పరిరక్షణ ప్రాయశ్చితదీక్ష

అరసవల్లి, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణకై ప్రాయశ్చితదీక్షను పల్లెపల్లెకు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో పారాయణాన్ని భక్తులు నిర్వహించారు. శ్రీకాకుళం నియోజకవర్గ జనసేన నాయకులు ఉదయ్‌శంకర్, గురుప్రసాద్, మోహన్‌లక్ష్మి ఆధ్వర్యంలో భక్తులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి మహామంత్రాన్ని పఠించారు.

ఘనంగా అమ్మవారి పూజలు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని పురుషోత్తపురంలో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. పొందరవీధి భక్తులు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి పూజలు నిర్వహించారు.

తెదేపా కార్యకర్తలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి కోల శ్రీనివాసరావు చికిత్స నిమిత్తం రూ.2 లక్షలు ఆర్థికసాయం ఎమ్మెల్యే శంకర్ అందించారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ నగర్‌లోని శ్రీనివాస్ ఇంటికి వెళ్లిన ఆయన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే శంకర్, తెదేపా నాయకులు అందించిన ఆర్థిక సాయాన్ని అందించారు. నగర తెదేపా అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణరావు, డివిజన్ ఇన్‌ఛార్జులు ఉంగటి వెంకటరమణ, కవ్వాడి సుశీల, సతీష్‌బాబా పాల్గొన్నారు.


శ్రీనివాసరావుకు ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

మంత్రి కొల్లు రవీంద్రకు సత్కారం

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను తెదేపా రాష్ట్ర జంగమ సాధికార డైరెక్టర్ విభూతి సూరిబాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సంఘం తరపున సత్కరించారు. బీసీ సంఘ ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గురుమూర్తి ఉన్నారు.




కాలువల్లో పైపులైన్లు

పురపాలక పరిధిలోని వార్డులకు తాగునీరు అందించే ప్రధాన పైపులైన్లు కొన్నిచోట్ల మురుగునీటి కాలువల్లో ఉండటంతో వాటిని చూసిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తాండ్రాసి మెట్ట నుంచి వస్తున్న ప్రధానపైపు రైల్వేట్రాక్‌కు ఆనుకొని రావడంతో కొన్ని చోట్ల వాల్వులు మురుగునీటిలో కలుస్తున్నాయని పట్టణ వాసులు చెబుతున్నారు. పైపులైన్లు పురాతన కాలం కావడంతో తరుచుగా లీకై ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. ఈ సమస్యపై పురపాలక కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా కాలువల్లో పైపులు లేకుండా చూస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం



అల్లుకున్న నిర్లక్ష్యం..



సరుబుజ్జిలి మండలంలోని చిన్నమతలబుపేట అంగన్‌వాడీ కేంద్రం భవనం పొదలు అల్లుకుని ప్రమాదకరంగా తయారైంది. చిన్నారులు, గర్భిణులు వచ్చే ఈ భవనంలోకి పొదలు ద్వారా విష కీటకాలు, సర్పాలు ప్రవేశించే అవకాశం లేకపోలేదని, అధికారులు స్పందించి వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పీవో ఎస్.గీత వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

రోడెక్కిన మురుగు..

ఆమదాలవలస పురపాలక పరిధిలోని 1వ వార్డు పార్వతీశంపేటలో కాలువలు లేక మురుగు రోడ్డుపై నిలిచి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుతం ప్రభుత్వంలోనైనా కాలనీ అభివృద్ధికి నోచుకుంటే బాగుంటుందని వారు కోరుతున్నారు. సమస్యపై పురపాలక కమిషనర్ పి.బాలాజీప్రసాద్ వద్ద ప్రస్తావించగా మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో పూడికతీత పనులు జోరుగా సాగుతున్నాయని, ఇక్కడ కూడా సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం



క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు


క్రీడాకారిణిని అభినందిస్తున్న వప్పంగి జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఉమాసుందరి, ఉపాధ్యాయులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: క్రీడలతో ఉజ్వలభవిష్యత్తు సాధించవచ్చని వప్పంగి, సానివాడ పాఠశాలల ప్రధానోపాధ్యాయరాలు టి.ఉమాకుమారి అన్నారు.. హరియాణాలో జరిగిన 43వ జాతీయస్థాయి సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయస్థానం సాధించిన క్రీడాకారిణి బెందు జ్యోత్స్నను ఆయా పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

పారిశుద్ధ్యం మెరుగుపర్చడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా మంగళవారం పలుచోట్ల నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేసి చెత్త సేకరణ చేపట్టారు. – న్యూస్‌టుడే బృందం


పొందూరు: కోర్టు ఆవరణను పరిశుభ్రం చేస్తున్న జడ్జి జ్యోత్స్న


బుడగటపాలెం తీరంలో సేకరించిన చెత్తతో శ్రీ శివాని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

శాస్త్రీయ దృక్పథం పెంపొందించమే లక్ష్యం

ఆమదాలవలస పట్టణం, సరుబుజ్జిలి, శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించటం కోసం చెకుముకి పోటీలు దోహదపడతాయని మండల విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆమదాలవలస ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ★ సరుబుజ్జిలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శ్రీకాకుళం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ చెకుముకి పోటీలు నిర్వహించారు.

అథ్లెటిక్స్ పోటీలకు జట్ల ఖరారు

శ్రీకాకుళం అర్బన్: రాజమహేంద్రవరం వేదికగా ఈ నెల 4, 5, 6వ తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్లు ఖరారైనట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొన్న మధుసూదనరావు, ఎం.సాంబమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వివిధ క్రీడాంశాల్లో ఇటీవల కొన్నచిన్నారావు మెమోరియల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు.

యాజమాన్య పద్ధతితో అధిక దిగుబడులు


బూర్జ: పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి

రైతులు యాజమాన్య పద్ధతిలో పంటలు పండిస్తే అధిక దిగుబడులు సాధించగలరని పలువురు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మంగళవారం ఆమదాలవలస, బూర్జ, జి.సిగడాం మండలాల్లో పలు చోట్ల 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వారు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం, బూర్జ, జి.సిగడాం

అవీ..ఇవీ..అన్నీ

యోగా పోటీ విజేతలకు బహుమతులు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: బెంగళూరు బీకేఎస్ అయ్యంగార్ మెమోరియల్ 8వ జాతీయ స్థాయి ఓపెన్ యోగా ఛాంపియన్‌షిప్-2024, ఆదిత్య సాయి, శివ జ్యోతి యోగా కేంద్రాల ఆధ్వర్యంలో అంతర్జాలంలో నిర్వహించిన యోగాపోటీల్లో గెలుపొందిన విజేతలకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు.

స్వచ్ఛంద రక్తదానం చేయాలి

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: స్వచ్ఛంద రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు పి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నగరంలోని రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయం నుంచి నిర్వహించిన ర్యాలీని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీకాంత్ ప్రారంభించారు. ఏడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి రక్తదానం ఆవశ్యకతను వివరించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి ఆదిలింగం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాఠశాల, కళాశాల, నర్సింగ్ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.



చర్యలు తీసుకోండి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: టెక్కలిలో పంచాయతీరాజ్‌లో డిప్యూటీ ఈఈ అదనపు బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని పి.ఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కిల్లారి నారాయణరావు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు పి.జయమ్మలు, ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

ధ్రువపత్రాల అందజేత

అరసవల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్లో 16వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. డీపీటీవో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రెండోడిపో డీఎం శర్మ వాటిని అభ్యర్థులకు అందించారు. ఈ నెల 4వ వారంలో 18వ బ్యాచ్ ప్రారంభమవుతుందన్నారు.

'ఆరోపణలు అవాస్తవం'

పొందూరు గ్రామీణం: పొందూరు పట్టణంలోని కంచి కామాక్షి ఆలయంలో జరిగిన అవకతవకలపై స్థానిక పెద్దలు సమావేశం నిర్వహించారు. కంచికామాక్షి విశ్వబ్రహ్మణ సేవా సంఘం ఆలయ సభ్యులపై కొంత మంది మోపిన అభియోగాలపై మండల తెదేపా అధ్యక్షుడు రామ్మోహన్, పట్టణ మాజీ సర్పంచి విజయలక్ష్మి తదితరుల సమక్షంలో రికార్డులు పరిశీలించి ఎలాంటి అవకతవకలు జరగలేదని నిర్ధారణ చేశారు.

వసతి గృహంలో న్యాయవిజ్ఞాన సదస్సు

పొందూరు: పొందూరులో పోస్టుమెట్రిక్ బాలికల వసతి గృహంలో న్యాయవిజ్ఞాన సదస్సును జడ్జి జ్యోత్స్న నిర్వహించారు. విద్యార్థులకు పలు చట్టాలు, సెక్షన్లపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

గుజరాతీపేట(శ్రీకాకుళం), ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: వృద్ధుల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ పొగిరి ప్రకాష్ కోరారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సర్వజనాసుపత్రి, జెమ్స్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ కింద వృద్ధులకు వైద్య శిబిరాలు నిర్వహించారు. సర్వజనాసుపత్రి, జెమ్స్‌మెడికల్ సూపరింటెండెంట్లు డా. షకీలా, డా.లలిత పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెండు అతిథి అధ్యాపక పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సురేఖ ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీటెక్, పీజీ కంప్యూటర్ సైన్స్‌లో కనీసం 55 శాతం మార్కులు కలిగి నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు ధ్రువపత్రాలతో కళాశాలకు హాజరుకావాలని ఆమె కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


దుర్గారావు (పాతచిత్రం)

పొందూరు, న్యూస్‌టుడే: పురుగు మందు తాగిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పొందూరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తండ్యాం పంచాయతీ గూనానపేటకు చెందిన కుమరాపు దుర్గారావు(28), తల్లి లక్ష్మి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న ఆ యువకుడు రెండు రోజుల కిందట ఇంట్లో పురుగు మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. దుర్గారావు తండ్రి రెండేళ్ల కిందట మృతి చెందగా తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈ మేరకు పొందూరు ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జీవిత సారం భగవద్గీత

మానవతా విలువలు పెంపొందించేందుకు భగవద్గీత దోహదం చేస్తుందని పాఠశాల ప్రిన్సిపల్ ఉషారత్నం అన్నారు. జి.సిగడాం కస్తూర్బా పాఠశాలలో మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం పంపిణీ చేసిన మానవులందరికీ భగవద్గీత అనే పుస్తకాలను విద్యార్థులకు అందించారు. తితిదే ధర్మప్రచార పరిషత్తు శ్రీకాకుళం జిల్లా మేనేజర్ ఎం.లలితమణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, జి.సిగడాం

